



కార్మికశాఖ జేసీ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

- పలు రికార్డులు, భూమి పత్రాలు, నగదు స్వాధీనం
- నేడూ కొనసాగనున్న సోదాలు
- ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతోనే..



బాలు నాయక్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు (జేసీ) బాలు నాయక్ ఇంట్లో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో ఈయన నివాసం ఉంటున్నారు. ఈ ఇంటితో పాటు కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, కుటుంబీకులు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పౌల్ట్రీ ఫారంతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేశారు. తిరుపతిలోని ఇంట్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. బాలునాయక్ కుమారుడు నిర్వహిస్తున్న ఆర్‌సీ సర్జికల్ షాపులోనూ తనిఖీలు చేశారు. ఇంట్లో పలు కీలక రికార్డులు, బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆయన స్వగ్రామమైన రాయచోటి సమీపంలోని బిడికి తాండా, రాయచోటి, మదనపల్లె, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, పౌల్ట్రీ ఫారాలు, భూములకు సంబంధించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సంబేపల్లిలో ఆయనకు పౌల్ట్రీఫారం ఉన్నట్లు గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల గురించీ ఆరా తీశారు. కర్నూలు కేంద్రంగా కార్యాలయం వున్నప్పటికీ తిరుపతిలోని ఇంటి నుంచే అన్ని కార్యకలాపాలు నిర్వహించే వారని ఆరోపణలున్నాయి. కాగా, స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్లు, కీలక రికార్డులనులోతుగా పరిశీలిస్తున్నారు. ఈ సోదాలు శనివారం కూడా కొనసాగనున్నాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ చెప్పారు.

భూమనా.. ఆ రహస్యం చెప్పవా



మీరు వ్యాపారాలు చేయలేదు. ఉద్యోగాలూ లేవు. మరి రూ.వందల కోట్లు ఎలా వచ్చాయో.. ఆ రహస్యం చెప్పవా భూమనా. అలాగైతే మేమూ పీ4 ద్వారా ఏపీని పేదరికం లేని రాష్ట్రంగా మార్చుకుంటాం. శుద్ధపూస మాటలు చెప్పే కరుణాకర రెడ్డి.. అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుంది. కాస్త ఆలస్యంగానైనా జైలుకు వెళ్లక తప్పదు. టీటీడీ ఇంజనీరింగ్ విభాగానికి రూ.300 కోట్ల బడ్జెట్ ఉంటే.. ఆయన చైర్మన్ అయిన మూడు నెలల్లోనే రూ.1233 కోట్ల పనులు ఎలా కేటాయించారు?

- బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్

ఇప్పుడు డమ్మీ అంటే కుదరదు



వైసీపీ హయాంలో రూ.3600 కోట్ల లిక్కర్ కుంభకోణం జరిగినప్పుడు నారాయణస్వామి ఎక్సైజ్ శాఖకు మంత్రి. డిప్యూటీ సీఎం కూడా. ఆయనకు తెలియకుండానే ఇదంతా జరిగిందంటే నమ్మేందుకు ప్రజలేం అమాయకులు కారు. ఇప్పుడు డమ్మీ.. డమ్మీ అంటే కుదరదు. డమ్మీకి రూ.వేల కోట్లు ఎలా వస్తాయి? ఇప్పటికే లిక్కర్ డాన్లు వరుసపెట్టి అరెస్టయ్యారు. నారాయణస్వామిని మాత్రం ఎందుకు వదిలిపెడతారు.

- జనసేన నేత కిరణ్‌రాయల్



పుత్తూరులోని నారాయణస్వామి ఇంటి ముందు సందడి



ఇంటిముందు సిట్ సిబ్బంది భద్రత

మాజీ డిప్యూటీ సీఎం ఇంటి తలుపుతట్టిన సిట్

- లిక్కర్ స్కామ్ కేసులో ఏడు గంటలపాటు విచారణ
- ఇప్పటికే జైల్లో మిథున్, చెవిరెడ్డి
- నారాయణస్వామినీ అరెస్టు చేస్తారనే ప్రచారం
- వైసీపీ వర్గాల్లో గుబులు



సిట్ విచారణానంతరం మీడియాతో మాట్లాడుతున్న నారాయణస్వామి

తిరుపతి/పుత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం తాజాగా అప్పటి ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఇంటి తలుపు తట్టింది. ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించింది. విజయవాడకు వచ్చి విచారణకు హాజరు కావాలని ఇదివరకే సిట్ అధికారులు నారాయణస్వామికి నోటీసు ఇచ్చారు. వయోభారం, అనారోగ్యాల కారణంగా విజయవాడ రాలేనని చెప్పడంతో విజయవాడ నుంచే టెలి కాన్ఫరెన్సు ద్వారా విచారించారు. మళ్లీ విచారణకు హాజరు కావాలని రెండోసారి నోటీసు ఇవ్వగా, నారాయణస్వామి నుంచి స్పందన లేదు. దీంతో సిట్ బృందం శుక్రవారం ఉదయం 11 గంటలకు పుత్తూరు చేరుకుని మాజీ మంత్రి ఇంటి తలుపు తట్టింది. ఇదివరకు తిరుపతి జిల్లా ముఖ్య అధికారిగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన మొదలుకుని, అమలు, అవకతకల వరకూ పలు అంశాలపై లోతుగా విచారించారు. మరోవైపు లిక్కర్ స్కామ్ దర్యాప్తులో ఉపకరిస్తాయన్న ఉద్దేశంతో నారాయణస్వామి ల్యాప్‌టాప్‌ను, మొబైల్ ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. దీనికోసం పంచనామాకు వీఆర్వోలను పిలిపించగా, అరెస్టు చేస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఈ కుంభకోణంలో ఇప్పటికే జిల్లాకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టయి జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. వైసీపీలో వీరిద్దరూ బలమైన నేతలు. వైసీపీ అధినేత జగన్‌కు సన్నిహితులుగా ముద్ర పడ్డారు. గత ప్రభుత్వంలో బాగా అధికారం కూడా చెలాయించారు. వారిద్దరి అరెస్టు నేపథ్యంలో అదే శాఖకు మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇంటికి సిట్ అధికారులు రావడంతో ఆయన్నూ అరెస్టు చేస్తారనే వైసీపీ వర్గాలు భావించాయి. ఈ పరిణామం ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గాల్లో గుబులు పుట్టించింది.

తొంగి చూడని వైసీపీ నేతలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో.. కేసు ఏదైనా వైసీపీ నేతల అరెస్టు లేదా విచారణలను ఎదుర్కొనే క్రమంలో ఆ పార్టీ నేతలు మద్దతుగా వెళ్లడం, పోలీసు అధికారులకు అడ్డుపడిన సంఘటనలు అనేకం జరిగాయి. అయితే పుత్తూరులో శుక్రవారం సిట్ అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించేందుకు వచ్చిన సందర్భంలో ఓ స్థాయి నాయకులు కూడా ఆయన ఇంటి వైపు తొంగి చూడలేదు. ఆయన నివాసమున్న పుత్తూరు పట్టణం.. నగరి నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. మాజీ మంత్రి రోజాకు, ఈయనకు ఓ విధంగా చెప్పాలంటే విభేదాలున్నాయి. దాంతో స్థానిక వైసీపీ నేతలు, శ్రేణుల నుంచి ఆయనకు ఎలాంటి మద్దతూ లభించలేదు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలుసుకుని జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచీ పదుల సంఖ్యలో కార్యకర్తలు మాత్రమే వచ్చారు. జిల్లాలో ఒకరొకరుగా నేతలు జైలుపాలవుతుండడం, కేసుల్లో చిక్కుకుంటుండడంతో వైసీపీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం సడలుతున్న పరిస్థితి కనిపిస్తోంది.


‘చవితి’ మండపాలకు సింగిల్ విండో అనుమతులు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి మండపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము లేకుండా సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ‘మండపాలను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు కమిటీగా ఏర్పడి ఆ వివరాలను సమీప పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలి. తర్వాత Ganeshutsav.net వెబ్‌సైట్ ఓపెన్ చేసి.. అప్లై హియర్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. దరఖాస్తుదారుడి మొబైల్ నెంబరు నమోదు చేశాక ఓటీపీ నెంబరు నమోదు చేయాలి. పేరు, అడ్రస్, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అప్లికేషన్ జనరేట్ అయ్యాక పోలీసు శాఖ అనుమతి కోసం వారి లాగిన్‌కు వెళుతుంది. అనుమతికి సంబంధించిన క్యూఆర్ కోడ్, నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై బుక్‌లెట్ డౌన్‌లోడ్ అవుతుంది. దాన్ని ప్రింట్ తీసుకుని మండపాల వద్ద ఉంచాలి. మండపాల వద్ద మైక్ అనుమతి కావాలనుకుంటే మీ-సేవ కేంద్రాల వద్ద పొందాలి. లౌడ్ స్పీకర్లను పెట్టకూడదు.మండపాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత. ప్రైవేటు, పంచాయతీ స్థలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా స్థల యజమాని అనుమతి తీసుకోవాలి’ అని ఆ ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు.

కృష్ణాజలాల పరవళ్లు

- పుంగనూరు వద్ద పూజలు చేసి హారతిచ్చిన మంత్రి



నేతిగుట్లపల్లె పంప్ హౌస్ నుంచి దుముకుతున్న కృష్ణాజలాలు



ప్రసన్నయ్యగారిపల్లె వద్ద జలహారతి ఇచ్చి పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిరా బిరా కృష్ణమ్మ పరుగులు తీస్తూ శుక్రవారం చిత్తూరు జిల్లా సరిహద్దుల్లోకి చేరుకుంది. పుంగనూరు సమీపంలోని ప్రసన్నయ్యగారిపల్లె వద్ద టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి మంత్రి రాంప్రసాదరెడ్డి హంద్రీనీవా కాల్వలో కృష్ణా జలాలకు పూజలు చేసి హారతిచ్చారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొస్తున్నారని చెప్పారు. కాగా, హంద్రీనీవా కాలువ ద్వారా పరవళ్లు తొక్కుతూ కృష్ణాజలాలు శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో పుంగనూరు మండలంలోని ఈడిగపల్లె, చిలకవారిపల్లె మీదుగా నేతిగుట్లపల్లె లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌కు చేరాయి. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ విఠల్‌కుమార్ ఆదేశాలతో లిఫ్ట్ ద్వారా నాలుగుపైపులకు గానూ రెండుపైపుల్లో నీటిని విడుదల చేశారు. శుక్రవారం పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన ఉండడంతో జలహారతి ఇప్పించారు. పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లె, మార్లపల్లె, మాదనపల్లె మీదుగా నీరు పరవళ్లు తొక్కుతూ పెద్దపంజాణి మండలంలోకి ప్రవేశించాయి.కాగా ఉదయం నుంచి హంద్రీనీవా కాల్వల ప్రాంతానికి ప్రజలు వెళ్లి కృష్ణాజలాలకు పూజలు చేశారు. తాగు,సాగు నీటి కష్టాలు తీర్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ఒకటిన పింఛన్లు అందజేస్తాం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాత్కాలిక సదరం ధృవపత్రాలు పొందిన దివ్యాంగులకు సెప్టెంబరు ఒకటో తేదీన పింఛను మొత్తం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సదరం పునఃపరిశీలనలో అనర్హులుగా గుర్తించి నోటీసు అందుకున్న దివ్యాంగులు తాము అర్హులమని భావిస్తే సంబంధిత మండల పరిషత్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నోటీసు అందుకున్న 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన వారిగా ధృవీకరించి తాత్కాలిక సదరం ధృవపత్రం పొందిన దివ్యాంగులకు పింఛను నిలుపుదల చేస్తూ జారీ చేసిన నోటీసులను వెనక్కి తీసుకోవడానికి సచివాలయ సంక్షేమ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



నిషిధరాజు - అశోక్‌రాజు - కోలా ఆనంద్ - సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో మరికొందరికి చోటు

పుత్తూరు/శ్రీకాళహస్తి/తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. పుత్తూరులోని బీజేపీ కార్యాలయంలో స్వీట్లు పంచారు. పుత్తూరుకు చెందిన ఈమె 14 ఏళ్లుగా బీజేపీలో వివిధ పదవుల్లో పనిచేశారు. 2019లో నగరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి మహిళలను జాగృతం చేస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తానన్నారు.

- ఇక, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పుత్తూరులోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలల యజమాని డాక్టర్ కొండూరు అశోక్‌రాజు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్ నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వీరు ప్రకటించారు. ఇక, నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

విద్యాశాఖ, అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు అనుమతి

సబ్జెక్టుల వారీగా జిల్లా టాపర్లు

- వివరాలు 8వ పేజీలో -

మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా పొంగళ్లు తీసుకొస్తున్న దిగువ రెడ్డివారిపల్లె గ్రామస్థులు

చంద్రగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం దిగువ రెడ్డివారిపల్లె గ్రామస్తులు శుక్రవారం చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు వైభవంగా పొంగళ్లు పెట్టారు. సర్పంచ్ రేవతి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్ళు తీసుకొచ్చి సమర్పించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత గ్రామస్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది, రెడ్డివారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్‌మనోవికాస్‌లో అల్పాహారం పంపిణీ



తిరుపతిరూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పద్మావతిపురంలోని పాస్ మనో వికాస్ ప్రత్యేక ప్రతిభావంతుల రెసిడెన్షియల్ పాఠశాలలో మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా శుక్రవారం చిరు అభిమాన సంఘం ఆధ్వర్యంలో పిల్లలకు అల్పాహారం, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు సోమ సుందరం, వీఎస్ జగదీశ్, నారాయణ, లోకనాథం, దేవా, బుజ్జి పాల్గొన్నారు.

దళితుల భూసమస్యలు పరిష్కరించండి



ఎస్‌ఐని సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎర్రావారిపాళెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో దళితుల భూసమస్యల పరిష్కారానికి సహకరించాలని దళిత సంఘ నేత శ్రీనివాసులు ఎస్ఐ బాలకృష్ణయ్యను కోరారు. శుక్రవారం దళిత సంఘాల నేతలు ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్ఐని సన్మానించిన వారిలో సంఘాల నాయకులు మహేష్, రెడెప్ప, పులిచెర్ల విశ్వనాథ, అంజి, రెడెప్ప, హరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాక్సిన్



ఎర్రావారిపాళెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరబైలు మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం టీకాల కార్యక్రమం జరిగింది. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పాఠశాలోని 120 మందిలో 101 మందికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతం మానవ మేధస్సుకు ఆధారభూతమైన భాష



మాట్లాడుతున్న డాక్టర్ నిరంజన్‌బాబు

రామచంద్రాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంస్కృతం మానవ మేధస్సుకు ఆధారభూతమైన భాష అని వెంకటేశ్వర వైద్యకళాశాల వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి మోహన్ అన్నారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో శుక్రవారం న్యూఢిల్లీకి చెందిన కేంద్ర సంస్కృత విద్యాలయం భాగస్వామ్యంతో సంస్కృత భాష ధ్రువపత్ర కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష భారతీయ విజ్ఞాన సంపదకు ద్వారంగా నిలుస్తుందన్నారు. ఇలాంటి కోర్సు లు మౌలిక అభ్యాసానికి దోహదపడుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ నిరంజన్ బాబు మాట్లాడుతూ కోర్సు వివరాలు, అధ్యయన విధానంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు చిరు అభిమానుల అన్నదానం



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న చిరు అభిమానులు

పాకాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువులో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరు ఫ్యాన్స్ సేవాసమితి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. భగవాన్ శ్రీరామతీర్థ సేవాశ్రమం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. శివాలయంలో పూజలు చేసి ఆవరణలో మొక్కలు నాటారు. చిరు ఫ్యాన్స్ సేవాసమితి అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, ప్రతినిధులు పురుషోత్తం, మదన మోహన్, వాసురాయల్, చరణ్, జనార్ధన్, బాలాజీ పాల్గొన్నారు.

కలుపుపై అవగాహన కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వయ్యారిభామ కలుపుపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. అసోసియేట్ డీన్ రమణ, వర్సిటీ సేద్య విజ్ఞాన విభాగాధిపతి మునిరత్నం పాల్గొని మాట్లాడారు. వయ్యారిభామ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించేందుకు రైతుల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ఈ మొక్కతో పంట ఉత్పత్తి, పశువులు ఆహారంగా తీసుకుంటే పాల ఉత్పత్తి తగ్గుతాయని ప్రయోగాత్మకంగా వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తిరుమల డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, దాన్ని తీసుకుని 18నెలలు పూర్తయి ఉండాలని పేర్కొన్నారు. 55 సంవత్సరాల లోపు ఉండాలని, లైసెన్స్ బ్లాక్ లిస్టులో ఉండకూడదని తెలిపారు. రోజుకు వేతనం రూ.వెయ్యి ఇస్తారని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440779530ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్తంభాలకు ఉన్న డిష్, నెట్ వైర్లను తొలగించండి

చంద్రగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న డిష్, నెట్ కనెక్షన్ వైర్లను తొలగించాలని ఈఈ రెడ్డెప్పరెడ్డి ఆదేశించారు. స్థానిక విద్యుత్ శాఖ చంద్రగిరి సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైర్లను ఆపరేటర్లు తొలగించకుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వినాయక మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. నిర్ధేశిత చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈసమావేశంలో డీఈఈ శేషాద్రిరెడ్డి, ఏఈలు నాగరాజు, వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

తిరుపతి(జీవకోన), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని మట్టితో చేసిన విగ్రహాలనే పూజిద్దామని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. శుక్రవారం నిమజ్జన కమిటీ కార్యాలయంలో మట్టి గణపతి పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుందామన్నారు. కన్వీనర్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపినాథ్, రామస్వామి, వెంకటేశ్వర్లు, సింగంశెట్టి సుబ్బరామయ్య, నవీన్, వరప్రసాద్ పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతి దేవి సాక్షాత్కారం

తిరుచానూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు నేత్ర పర్వంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తి వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కన్నులపండువగా సాగింది. సాయంత్రం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసాచార్యులు, మణికంఠస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుబాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఎర్రావారిపాళెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ బాలకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండప కమిటీ సభ్యుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డీజేలు పెట్టరాదని సూచించారు.

ముగిసిన గుండాల గంగమ్మ తిరుణాళ్ల

తిరుపతిరూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీ జగనన్న కాలనీలో కొలువైన గుండాల గంగమ్మ తిరుణాళ్ల శుక్రవారం ఘనంగా ముగిసింది. తొలుత అమ్మవారిని అలంకరించి దీపారాధనతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి సమర్పించే పొంగళ్లను మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసు కొచ్చారు. అనంతరం పొంగలితో తయారు చేసిన అన్న ప్రసాదాలను అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. కాగా కాలనీలో నివాసం ఉంటున్న నరసింహారెడ్డి కుటుంబీకులు అమ్మవారి ఆలయం వద్ద దాదాపు రూ.5లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు.

అల్లా జెండా ఊరేగించి మొక్కు తీర్చుకున్న హిందువు



రామచంద్రాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లె గ్రామంలో అల్లా (నాగూరుస్వామి) తమ కోర్కెలు తీర్చినందుకు శుక్రవారం ఒక హిందువు జెండా ఊరేగింపు నిర్వహించి మతసామరస్యం చాటాడు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ పాల వ్యాపారం చేస్తూ జీవించేవాడు. తన బిడ్డలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదిస్తే జెండా ఊరేగింపు నిర్వహిస్తానని పదేళ్ల క్రితం అల్లాకు మొక్కుకున్నాడు. ఆయన కుమార్తె యామిని, భార్గవి ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం సింగపూర్‌లో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. ఆయన కోర్కెలు నెరవేరడంతో కుమార్తె, అల్లుళ్లను రప్పించి శుక్రవారం బంధువుల సందడి మధ్య అల్లా జెండా ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అల్లా జెండాకు హారతులు ఇచ్చారు.

మురుగు కాలువలు లేక ధ్వంసం అవుతున్న రోడ్లు



ముత్యాలమ్మ ఆలయం వద్ద అడవి నీరు చేరి ఏర్పడిన గుంత (పాతచిత్రం)



రోడ్డుపై ప్రవహిస్తున్న బాదూరు కాలనీ మురుగునీరు

రామచంద్రాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతం కింద నివాసం ఉన్న బాదూరు కాలనీకి మురుగుకాలువలు లేకపోవడంతో ఆర్‌అండ్‌బీ రోడు గుంతలమయమైంది. ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. 20 ఏళ్ల క్రితం బోదగుట్ట అడవికింద బాదూరు గ్రామస్తుల కోసం 150 మందికి కాలనీ ఏర్పాటు చేశారు. ఈ కాలనీ తిరుపతి -పచ్చికాపల్లం ఆర్ అండ్‌బీ రహదారి ఆనుకుని అడవికి మధ్యభాగంలో ఉంది. కాలనీలోని ఆరు వీధుల నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షాకాలం అడవి నుంచి వచ్చే నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వస్తుండటంతో గుంతలు ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారుతోంది. ప్రతి సంవత్సరం ఆర్‌అండ్‌బీఅధికారులు గుంతలు పూడుస్తున్నారే కాని కాలనీకి రహదారికి మధ్యలో కాలువ తీస్తే ఈ పరిస్థితి తలెత్తదు. అలాగే రాయలచెరువు, అనుపల్లి రోడ్డులో సూరావారి పల్లె వరకు కిలోమీటరు దూరం అడవి కింద రోడ్డు ఉంది. వర్షాకాలం అడవి నుంచి వచ్చే నీరు రోడ్డుపై వస్తుండటంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రదేశాల్లో చిన్నపాటి వంతెనలు ఏర్పాటు చేస్తే గుంతలు ఏర్పడే పరిస్థితి ఉండదు. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం

ఎంబీయూ అంతర్జాతీయ సదస్సులో వక్తలు



స్మారకావళిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

చంద్రగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీలోని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'హెర్బల్ మెడిసిన్స్ అండ్ న్యాచురల్ ప్రొడక్ట్స్, ఫ్రమ్ ట్రెడిషన్ టు మోడర్న్ థెరప్యూటిక్స్' అనే మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహి స్తున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా మోడర్న్ సైన్స్ ద్వారా సంప్రదాయ వైద్యాన్ని గ్లోబలైజ్ చేయడంపై చర్చలు జరిగాయి. శుక్రవారం జరిగిన చర్చల్లో డీన్ డాక్టర్ జయప్రకాశ్ ఎం.ఆర్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగరాజ్ రామరావులు ప్రసంగించారు. కొవిడ్ సమయంలో ఔషధ పరిశ్రమ పాత్రను ప్రస్తావించారు. హెర్బల్ ఔషధాల ప్రాముఖ్యతను విశదీకరించారు. తక్కువ ఖర్చుతో వైద్యం అందించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ దీక్షి మాట్లాడుతూ ఆయుర్వేద ఔషధాల ప్రాధాన్యం, వ్యాధుల నివారణలో వాటి పురోగతి, రోజువారీ జీవితంలో యోగా అవసరం, జీవనశైలిలో మార్పుల ప్రాముఖ్యతపై విలువైన సూచనలు చేశారు. ఈసదస్సుకు దేశం నలుమూలల నుంచి, విదేశాల నుండి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జేపీ యనాదయ్య, డాక్టర్ కె.తమిళ్ వనన్ సమన్వయం చేశారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

చంద్రగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్‌రాయల్, గోపిరాయల్, నీలాద్రి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో లంకెళ్ల లలిత, మునిరత్నం రాయల్, నాగరాజు, శ్రీనివాసులు, చిన్నిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ చక్రవర్తి

పాకాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్రబ్యాంక్ పాకాల శాఖలో శుక్రవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఖాతాదారులకు బ్యాంకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. డిపాజిట్‌లపై 8.1 శాతం వడ్డీ పొందవచ్చని తెలిపారు. 10 సంవత్సరాల క్రితం బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేసిన ఖాతా దారులు ఆధార్, పాన్‌కార్డుల జిరాక్స్, ఫొటో తీసుకువచ్చి కేవైసీ చేసుకోవాలని సూచించారు. రైతులకు అందజేస్తున్న రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బి.చక్రవర్తి, ఉషామాధవి, ఇ.దొరస్వామి, ఖాతా దారులు టి.బాలశంకర్, గురుమూర్తి, నాగరాజ, ఆంజినేయులు, ఆదికేశవులు, మచ్చాదొరస్వామినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నాయకుల జన్మదిన వేడుకలు



చంద్రగిరి, ఆగస్టు, 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, నరసింగాపురం సింగిల్ విండో ఛైర్మన్ వినోద్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వారికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్య దర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, లోకాద్రినాయుడు, నవీన్, మురళి పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను నాశనం చేసే కుట్రతోనే బిల్లు

- ఏపీలో నష్టపోయేది జగనే
- మాజీ మంత్రి చింతా మోహన్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలను నాశనం చేయలన్న కుట్రతోనే పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బిల్లు ప్రవేశపెట్టారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 30రోజులు జైల్లో ఉంటే అన్ని కోల్పోతారని బిల్లులో చేర్చారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో నష్టపోయేది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో జైలు జీవితం గడిపారని, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రస్తుతం జైలులో ఉన్నారని, అంటే వీరు చట్ట సభలకు వెళ్లకూడదా అని ప్రశ్నించారు. తాను రెండు నెలలుగా బీజేపీ స్కాములపై మాట్లాడుతుంటే ఆ పార్టీ నాయకులు మౌనంగా ఉన్నారన్నారు. రూ.100 కోట్లకు పైగా ఎన్‌పీఏ రుణాలను మాఫీ చేశారని, అందులో ఎక్కువగా గుజరాతీలే ఉన్నారని చెప్పారు. రష్యా చౌకగా రూ.25కే క్రూడ్ ఆయిల్ ఇస్తుంటే ఇక్కడ మాత్రం రూ.100 లేనిదే పెట్రోల్ దొరకడం లేదన్నారు. ఇది ఎవరికి ప్రయోజనమని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. టీటీడీని కేవలం రాజకీయాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో బ్రేక్ దర్శనాలు 8వేలకు పెరిగిందని, కాంగ్రెస్ హయాంలో 400 వరకు మాత్రమే ఇచ్చామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేశారు కానీ.. ఎస్సీ నాయకుల పాదయాత్రకు మాత్రం అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఎస్వీ యూనివర్సిటీలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఆరు నెలలుగా ఎదురు చూస్తుండటమే దీనికి నిదర్శనమని అన్నారు. 16సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రూ.16 అయినా తెచ్చాడా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, రావణ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్, సమీన్‌ఉల్లా, యార్లగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

మఠం భూముల్లో కరెంటు మీటర్లు తీసిస్తా

- మోసం చేసిన యువకుడిపై కేసు



తేజ

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'నాకు చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఆయన సతీమణి సుధా రెడ్డి తెలుసు. వారికి చెప్పి మఠం భూముల్లో కావాలంటే కరెంటు మీటర్లు తీసిస్తా' అంటూ డబ్బులు తీసుకుని మోసం చేసిన తేజపై కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్యే తనకు తెలుసంటూ, ఆయన పీఏ వినోద్‌కుమార్ ఫ్రెండని చెబుతూ పనులు చేయిస్తానని తిరుపతి రూరల్ గాంధీపురానికి చెందిన తేజ మాయ మాటలు చెప్పేవాడు. గాంధీపురం శ్రీనగర్ కాలనీకి చెందిన రమేష్, రూపేష్ నుంచి రూ.49,300 వసూలు చేశాడు. దీనిపై ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డికి సమాచారం ఇవ్వగా.. అలాంటి మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే పీఏ వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, తేజను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇంకా ఎంతమంది బాధితుల నుంచి డబ్బులు వసూలు చేశాడనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, రీసెర్చ్ స్కాలర్ అశోక్, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్ మాట్లాడుతూ వామనరావు భవన్‌లో మరుగుదొడ్లు లేవని, ప్రకాశం భవన్‌లో లిఫ్ట్ పనిచేయడం లేదని అన్నారు. పరీక్షల విభాగం లో సర్టిఫికెట్లు సకాలంలో ఇచ్చేలా చూడాలన్నారు. విద్యార్థినుల హాస్టల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతి నాయుడికి విన్నవించారు. వారంలోపు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, వాసు, శ్రీకాంత్, భాను, రాజు, చక్రవర్తి, అనిల్, వేణు, మహేశ్వరి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

చంద్రగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడిన ఏ.రంగంపేట ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఉపాధి పనులకు సంబంధించిన అక్రమాలను గుర్తించారు. రూ.1,26,990ల రికవరీకి ఆదేశించారు. ఇందులో రూ.54,990 రికవరీ కాగా, అపరాధం కింద రూ.72 వేలు విధించారు. దీనికి కారణమైన ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఆదేవిధంగా టెక్నికల్ అసిసెంట్లు రవికుమార్, గోపిలకు మెమో జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, ఏపీడీ రెడ్డెప్ప, ఎస్టీఎం ఎం.కోనయ్య, ఎస్ఆర్పీ వెంకయ్య, జెక్యూసీ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ అడిషినల్ పీడీ ప్రభావతి, ఎంపీడీవో వెంకటరత్నం, ఏపీవో భార్గవి, జేఈలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీవారి అభిషేక సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన అభిషేక సేవలో పాల్గొన్నారు. రంగనాయక మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎస్వీయూ, మహిళా వర్సిటీలో క్రీడాకారులకు బస

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హాజరుకానున్న క్రీడాకారులకు శ్రీవేంకటేశ్వర, పద్మావతి మహిళా యూనివర్సిటీలలో బస ఏర్పాటు చేశారు. 516 మంది చొప్పున మహిళలు, పురుషులు వస్తుండటంతో శాప్ ప్రతిష్టాత్మకంగా భావించి వసతి గృహాలను కేటాయించి, సౌకర్యాలు కల్పిస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయానికి 26 జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకుంటారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు.

టైర్లకు తగులుకున్న కేబుళ్లు



తిరుపతి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం బండ్లవీధి నాలుగుదారుల్లో శుక్రవారం విద్యుత్‌స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు కిందపడిపోయాయి. వీటిపై అటు వెళ్లిన వాహనాలు కేబుల్స్ చుట్టలో ఇరుక్కుపోయాయి. ఈ కేబుల్ వైర్లు టైర్లలో ఇరుక్కుపోవడంతో తొలగించడానికి అపసోపాలు పడ్డారు. చీకట్లో పాదచారులు కూడా వైర్లు తగులుకొని అదుపుతప్పి పడిపోయారు.

ఎస్వీయూలో మెగా రక్తదాన శిబిరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఎస్వీయూలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 20 మంది రక్తదానం చేశారు. వీరికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు డాక్టర్ రమణయ్య, జగదీష్, సంజీవ్, తరుణ్, లారెన్స్ సునీల్ పాల్గొన్నారు.

25న కార్గో సెంటర్ తరలింపు



సిద్ధమవుతున్న కార్గో కేంద్రం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులోని కార్గో సెంటర్‌ను ఈనెల 25న మరో చోటుకు తరలించనున్నారు. శ్రీహరి బస్టాండు సీలింగ్, పిల్లర్లకు పెచ్చులూడిపోతుండడంతో భవనాన్ని తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రదేశంలో ఉన్న ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయం, కార్గో కేంద్రాన్ని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండు నుంచి వెలుపలకు వెళ్లే దారిలో ఇటీవల మరమ్మతు చేసిన ఐదు దుకాణ గదులు, డీపీటీవో కార్యాలయం కింది భాగంలో ఖాళీగా హాలును సిద్ధం చేసి, సోమవారం ఉదయం కార్గో సెంటర్, ఇతర కౌంటర్లను తరలించనున్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



తిరుపతి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జనసేన సీనియర్ నేత కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో పాత తిరుచానూరు రోడ్డు అంకాలమ్మ ఆలయం వద్ద పారిశుధ్య కార్మికులకు చీరలు, పసుపు, కుంకుమలతో కూడిన సారెను పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. జనసైనికులు కిశోర్, హేమకుమార్, సుభాషిణి, మనోజ్, సాయిదేవ్, దుర్గ, చందన పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఉదయం మంగళం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, మందుల కొరత రాకూడదని, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ నిధులను ప్రాధాన్యత క్రమంలో వాడుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, మురళి పాల్గొన్నారు.

పంబ వాయిద్య కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న సొసైటీ నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : బలరామరెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పంబ వాయిద్య కళాకారులను ఘనంగా సన్మానించారు. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం గంగమ్మ కథను ఆలపిస్తూ పంబలు వాయిద్యం చేసే మోహన్, కిరణ్‌లకు పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఎస్వీయూ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆచార్య పుట్టా మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఏటా కళాకారులను సన్మానించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ ఈవో జయకుమార్, ఏపీ తెలుగు అకాడమి మాజీ డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు, ఎస్వీయూ పూర్వ వైస్ ఛాన్సలర్ పి.జయరామిరెడ్డి, ఎస్.హరీష్, డాక్టర్ కోడూరు జయప్రకాష్ పాల్గొన్నారు.

నీటితొట్టె చుట్టు మొక్కల తొలగింపు



తిరుపతి అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లె మార్గంలోని పశువుల నీటితొట్టె చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గురువారం ఆంధ్రజ్యోతిలో 'పశువుల నీటితొట్టెకు దారేదీ' అంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సప్తగిరికాలనీ గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది తొట్టె చుట్టు కమ్మేసిన చెట్లను తొలగించారు. తొట్టె కనబడేలా పరిశుభ్రం చేశారు.

రోడ్డు మరమ్మతులు షురూ



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని జయశంకర్‌కాలనీకి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రా వాటర్ సరఫరా కేంద్రం నుంచి ఫిల్టర్‌హౌస్‌కు తెలుగు గంగ రెండవ పైపులైను వేసే క్రమంలో వీధులను తవ్వేసి, అలాగే వదిలేశారు. దీనివల్ల కలుగుతున్న ఇబ్బందులను స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాన పనులు మొదలుపెట్టారు. టీడీపీ తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడు గోవిందరాజులు, చంద్ర, జనార్దన్, జయశంకర్, నవీన్, బుడ్డ పనులను పరిశీలించారు.

'వింగ్ టెక్' కార్మికులను ఆదుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సమీపంలోని వింగ్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. యువతకు ఉపాధి కల్పిస్తామనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూములను కారుచౌకగా తీసుకున్న పరి శ్రమ యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. పదివేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి కేవలం 250 మందితో పనులు చేయించుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

తిరుపతి

తిరువీధుల్లో కపిలేశ్వరుడి చిద్విలాసం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని కామాక్షి సమేతుడై కపిలేశ్వరస్వామి తిరువీధుల్లో విహరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కామాక్షి సమేతుడైన కపిలేశ్వరస్వామి ఉత్సవర్లు చప్పరం అధిరోహించి కర్పూర హారతులందుకున్నారు. అనంతరం తిరువీధుల ఉత్సవానికి బయలుదేరారు. ముందు కోలాట నృత్యాలు సాగుతుండగా చంద్రశేఖరుడి పురవిహారం అత్యంత వైభవంగా సాగింది. ఆదిదేవుడి దివ్యదర్శనంతో భక్తజనం పులకించింది.

3 నుంచి పవిత్రోత్సవాలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి ఆలయంలో సెప్టెంబరు 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 2వ తేదీ ఉదయం రుత్వికులకు విధులు కేటాయించి వస్త్రసమర్పణ చేస్తారు. సాయంత్రం ఆలయ విమాన ప్రాకారం చుట్టూ సేనాధిపతి ఊరేగింపు అనంతరం యాగశాలలో అంకురార్పణ నిర్వహించనున్నారు. 3వ తేదీ ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు ఉంటాయి. 4న మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మాడ వీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామి వారికి పవిత్రాలను సమర్పిస్తారు. 5న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ మూడు రోజులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

ఘనంగా అద్వైతానంద జయంతి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వినాయకనగర్ వద్దనున్న రామకృష్ణమిషన్ ఆశ్రమంలో శుక్రవారం సాయంత్రం స్వామి అద్వైతానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని రామకృష్ణ మందిరంలో అద్వైతానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు. స్వామి సుకృతానంద అద్వైతానంద జీవిత విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.





కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న రుత్వికులు - పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆగమోక్తంగా లక్ష కుంకుమార్చన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఊంజల్ సేవా మండపంలో కామాక్షిదేవితోపాటు లక్ష్మి, సరస్వతీ అమ్మవార్ల ఉత్సవర్లను ఉంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి కలశ స్థాపన చేశారు. కలశ పూజ అనంతరం సంకల్పం చేసి, పది మంది రుత్వికులు లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత అమ్మవారికి కర్పూర హారతులిచ్చి మహా నైవేద్యం సమర్పించారు. కలశ ఉద్వాసన చేసి ఆ జలాన్ని భక్తులపై చల్లారు. డిప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'స్పిర్చువల్ స్ట్రీట్' ఏర్పాటుకు సహకరిస్తాం



కమిషనర్ మౌర్యకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న శంకర్ నాయుడు, మునికృష్ణ

తిరుపతి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో స్పిర్చువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలనుకోవడం మంచి నిర్ణయమని, దానికోసం తమవంతు సహకారం అందిస్తామని లావణ్య ఫొటో ఫ్రేమ్స్ అధినేత శంకర్ నాయుడు అన్నారు. శుక్రవారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలిసి కమిషనర్ మౌర్యను కలిసి శ్రీవారి చిత్రపటం అందించారు. తిరుపతి లాంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో స్పిర్చువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన అభినందనీయమన్నారు. సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని, కౌన్సిల్లో నిర్ణయం తీసుకుని ముందుకెళతామని కమిషనర్ తెలిపారు.

గాజుల అలంకరణలో అన్నపూర్ణేశ్వరి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి లక్ష్మీపురం సర్కిల్‌లోని అన్నపూర్ణేశ్వరి సమేత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేశారు. అంతకుముందు పాలు, పసుపు, కుంకుమ, తేనె, పెరుగు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పట్టించుకోండి.. సారూ..!

కూలడానికి సిద్ధంగా కరెంటు స్తంభం



తీర్థకట్టవీధిలోని చిప్స్ కార్నర్ వద్ద కరెంటు స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. స్తంభం అడుగు భాగంలో చిలుముపట్టి పగుళ్లు వచ్చాయి. వర్షాలకు బలమైన గాలులువీస్తే పడిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

- తిరుపతి(కల్చరల్) (ఆంధ్రజ్యోతి)





సప్తగిరుల వైభవం నృత్య ప్రదర్శన - జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఉమ

మహోన్నతం లలిత కళలు

పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : లలిత కళలు మహోన్నతమైనవని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ వెన్నం ఉమ అన్నారు. భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం జరిగిన శ్రావణ సంగీత లహరి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యాభవన్ పాఠశాల భావితరాలకు అందిస్తోందన్నారు. కళారత్న, విశ్రాంత ఆచార్యులు ద్వారం వీజే లక్ష్మి, ప్రముఖ రచయిత జూలకంటి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ కూడా అలవర్చుకోవాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత అతిథులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. సభాధ్యక్షుడిగా డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ వ్యవహరించారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి డాక్టర్ అల్లాడి మోహన్, అసోసియేట్ సెక్రటరీ ఆచార్య దక్షిణామూర్తి శర్మ, ప్రిన్సిపాల్ పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. కాగా, విద్యార్థులు ప్రదర్శించిన సప్తగిరుల వైభవం నృత్యం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రుయా ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో చిరంజీవి అభిమానులు కేక్ కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు చిరంజీవికి మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, బాబ్జి, సుమన్‌బాబు, మునస్వామి, రాజమోహన్, ఆనంద్, సుధా, లక్ష్మీపతి, హేమంత్, పురుషోత్తం, సాయి, ఆది, రమేష్‌నాయుడు, సుమంత్, సుధాకర్, మధు, జీవన్, శ్రావణ్, అమృత, చందు, మార్కెట్ యువరాజ్, మాధవరావు, వెంకటేష్, శేషాద్రి, జానకిరామ్, ప్రభాకర్‌రెడ్డి, కిషోర్, ఉదయ్‌కృష్ణ, పవన్, ముకేష్, కిరణ్ పాల్గొన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి

తిరుపతి(రవాణా), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి అన్నారు. శుక్రవారం ఆర్టీఏ కార్యాలయంలో ప్రైవేటు వాహనాల యజమానులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత వాహన యజమానులపై చర్యలు చేపడతామన్నారు. తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మాట్లాడుతూ తిరుమలలో నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాహనాలను నిలుపుకోవాలన్నారు. ఏవీఎస్వో రమేష్ మాట్లాడుతూ తిరుమల వెళ్లే అన్ని వాహనాలకు విధిగా ఫాస్టాగ్ ఉండాలని తెలిపారు. జాతీయ రహదారి టోల్‌గేట్లు, దేవస్థానం పార్కింగ్ రుసుం పెరిగాయని, అందుకనుగుణంగా ఛార్జీలు పెంచాలని వాహన యజమానులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తిరుపతి ట్రాఫిక్ సీఐ భాస్కర్‌నాయక్, ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, దామోదర్‌నాయుడు, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మోహన్‌కుమార్, రమణనాయక్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

'ఈసీ మెంబర్ జ్యోతి వ్యాఖ్యలు సరికాదు'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పాలకమండలి సభ్యురాలు జ్యోతి వ్యాఖ్యలను పలువురు ఖండించారు. తనకు అవగాహన లేక దస్త్రంపై సమ్మతి తెలిపానని చెప్పడాన్ని బీజేపీ నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నేత హేమంత్ రాయల్, జనసేన నేత హిమవంత్ తప్పుబట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా రంగం పట్ల కనీస అవగాహన లేని వారిని పాలకమండలి సభ్యులుగా నియమించారని ఆరోపించారు. వైసీపీ అధిష్ఠానం ఒత్తిడితో లేఖలు రాస్తున్న వారిని ప్రభుత్వం తొలగించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో ఈస్ట్, మంగళం, నార్త్ సెక్షన్లలోని పలు ఫీడర్లలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీధి, మంచాల వీధి, రాములువారి గుడి, అనంతవీధి, విజయలక్ష్మి వీధి, త్యాగరాజ నగర్, ఇర్లానగర్, సాయిరాం వీధి, జీవకోన, సత్యనారాయణ పురం, లెప్రసీ కాలనీ, సాయినగర్, రాఘవేంద్రనగర్, అరుణోదయనగర్, శ్రీనగర్‌కాలనీ, ఎస్.ఎల్.వి.నగర్, మాధవనగర్, రైల్వే కాలనీ, సుందరయ్యనగర్ సమీప ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామూహిక వ్రతాలతో ఆధ్యాత్మికత



మృతుల కుటుంబాలకు చెక్కు అందిస్తున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సామూహిక వ్రతాలతో ఆధ్యాత్మిక భావాలు పెరుగుతాయని రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం ఓటేరులో శుక్రవారం రాస్ పొదుపు సంఘాల అధ్వర్యంలో 250 మంది మహిళలతో సామూహిక లక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసంలో మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించడం వల్ల సంప్రదాయాలు, క్రతువులు, నోములు, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. 45 ఏళ్లుగా రాస్ చేస్తున్న సేవలను వివరించారు. అనంతరం మృతిచెందిన ముగ్గురు సంఘ సభ్యుల కుటుంబాలకు రూ.1.55 లక్షల చెక్కును అందజేశారు. పేదలకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. జేఎస్ఎస్ ద్వారా కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. రాస్ సిబ్బంది వాణి, భార్గవి, కవిత, మునిరాజ పాల్గొన్నారు.

నేడు ప్రేరణ సొసైటీ వార్షికోత్సవం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లోని ప్రతిభను సమాజానికి పరిచయం చేసిన ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 18వ వార్షికోత్సవాన్ని శనివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆకాష్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా దివ్యాంగులకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ వేడుకలకు మహిళా డీఎస్పీ శ్రీలత, పలువురు ఎన్జీవోలు, ప్రముఖులు హాజరవుతారన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లైవ్లీహుడ్ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై మహిళలకు శిక్షణ అందించనున్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఇంటర్, ఆ పై విద్యార్హత కల్గిన వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 9440506558లో సంప్రదించవచ్చునని పద్మావతి వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంకు డిప్యూటీ జోనల్ మేనేజరు ఇందిర

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఇండియన్ బ్యాంకు డిప్యూటీ జోనల్ మేనేజరు ఇందిర అన్నారు. ఇండియన్ బ్యాంకు స్థాపించి 119 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుచానూరులోని సదరు బ్యాంకులో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తిరుచానూరు ఇండియన్ బ్యాంకు మేనేజరు రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. అసిస్టెంట్ బ్యాంకు మేనేజరు తేజ పాల్గొన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్‌పై శిక్షణ

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పది మంది ఎస్సీలకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఐదుగురు చొప్పున మహిళా, పురుష ఎస్సీలకు డ్రైవింగ్ నేర్పాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు అలిపిరి డిపోమేనేజర్ హరిబాబు తెలిపారు. అందుకయ్యే రుసుం రూ.2లక్షలు మంజూరు చేశారని వెల్లడించారు. వచ్చేనెల చివరల్లో ప్రారంభం కానున్న 36వ బ్యాచ్‌లో అవకాశం కల్పిస్తామని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి బాలవీరాంజనేయ స్వామి, సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఎస్పీఎఫ్ డీజీ అధికారి త్రివిక్రమ్ వర్మ, డిఫెన్స్ స్టాడింగ్ కమిటీ(ఎస్‌సీఓడీ) సభ్యులు, ఎంపీలు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్

బ్రహ్మోత్సవాలొస్తున్నాయ్


రిపేర్లు పూర్తి చేయండి

● తిరుమలలో వసతిపై ఈవో సమీక్ష

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న అన్ని వసతి గదుల్లో రిపేర్లను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అధికారులతో వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. లడ్డూప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. రాష్ట్ర ఆహార భద్రతాధికారులతో తిరుమలలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, హోటళ్లలో సంప్రదాయ భోజనం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,112

తలనీలాలు సమర్పించినవారు: 27,331

ఘల్లుమంది జానపదం



రవి కుల తిలకా రారా.. అంటూ శ్రీరాముడిని స్తుతిస్తూ సాగిన చెక్కభజన, హే బాపూ బంజారోళ్లం.. అంటూ గిరిజన సంస్కృతిని ప్రతిబింబించిన జానపదం, వస్తావా జానకి కోడిపందేమో నువ్వు.. అంటూ ప్రేమికుల మధ్య ప్రణయాన్ని తెలియజేసే జానపద నృత్యం. ఇలా.. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన జానపద కళారూపాల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడిఉన్న జానపద కళలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే తరానికీ అందించాలని ఎస్వీయూ వీసీ అప్పారావు సూచించారు. రాయలసీమ, చిత్తూరు ప్రాంతానికే ప్రత్యేకమైన కొన్ని జానపద కళలు ఉన్నాయని, ఇలాంటి విలువైన కళలను కాపాడుకోవాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. జానపద విజ్ఞానంలో జానపద సంగీతం, జానపద నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని పద్మావతి వర్సిటీ సంగీత-నృత్య విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. చెక్క భజన, కోలాటం పాటల్లో మన సంస్కృతి ఉందని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ చెప్పారు. విద్యార్థుల్లో జానపదం పట్ల మక్కువ కలిగించడానికి.. వారిలో జానపద విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి చెప్పారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి













కొండను ఢీకొన్న టెంపో - ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు

స్వల్పగాయాలతో బయటపడిన భక్తులు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. భక్తులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నారావారిపల్లెకు చెందిన కొందరు దర్శనం తర్వాత శుక్రవారం కారులో తిరుపతికి వస్తుండగా 26వ మలుపువద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద ఓ టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. విజయవాడకు చెందిన 10 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

భక్తితో భద్రతా బాధ్యతలు

● సిబ్బందితో ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): భద్రతా వైఫల్యాలకు తావులేకుండా తిరుమలలో విధులు నిర్వహించాలని ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో భద్రతా జాగ్రత్తలపై తిరుపతిలోని శ్వేతభవనంలో శుక్రవారం ఎస్పీఎఫ్ సిబ్బందితో డీజీ సమావేశమయ్యారు.. టీటీడీలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతం. భక్తి, అంకిత భావంతో, విచక్షణతో, క్రమశిక్షణతో భక్తులను మెప్పించే విధంగా భద్రతా సిబ్బంది సేవలందించాలన్నారు. హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోట్ అయిన 1998 బ్యాచ్ కానిస్టేబుళ్లను అభినందించారు.

నేడు హథీరాంజీ మఠం భవనం పరిశీలన

తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం ప్రధాన కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, మఠం ఇంఛార్జి ఈవో బాపిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించనున్నారు. ఈ బృందంతో పాటు తిరుపతి ఐఐటీ నుంచీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు రానున్నారు. గత మంగళవారం కలెక్టరేట్‌లో మఠం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, షాపుల నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అందరితో కలసి ప్రత్యక్షంగా మఠం భవనాన్ని పరిశీలించాలని, భవనం పటిష్టతను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని నాడు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికనుగుణంగా శనివారం ఉదయం 11 గంటలకు మఠం భవనం వద్దకు రానున్నారు. కాగా, శిథిలావస్థకు చేరిన ఈ పురాతన భవనాన్ని తిరుపతి ఐఐటీ నిపుణులు సైతం పరిశీలించి నివాస యోగ్యం కాదని, కూల్చివేతకు సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. దీంతో కూల్చివేతకు దేవదాయశాఖ టెండర్లు కూడా పిలిచింది. ఆ దశలో ఈ వివాదం రాజకీయ మలుపు తీసుకోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆచితూచి అడుగులేస్తున్నారు. భవనం కూల్చివేస్తే తిరిగి కొత్త భవనాన్ని నిర్మించే విషయమై దేవదాయ శాఖ నుంచీ స్పష్టత తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు భవనాన్ని కూల్చకుండా వారసత్వ కట్టడంగా కొనసాగించేందుకు అందుబాటులో వున్న అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. ఆ మేరకు పురావస్తు శాఖ, తిరుపతి ఐఐటీ, సెంట్రల్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర సంస్థలకు కూడా లేఖలు రాశారు. మొత్తానికీ శనివారం ఈ భవనాన్ని పరిశీలించాక ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై నగరవాసుల్లో ఆసక్తి నెలకొంటోంది.

నీట్ పీజీలో మెరిసిన తిరుపతి కుర్రోడు సాయినితేష్

● ఆలిండియాస్థాయిలో 136వ ర్యాంకు కైవసం



తిరుపతిరూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుచానూరు వీవీ లేఅవుట్‌కి చెందిన డాక్టర్ గండికోట సాయినితేష్ అత్యుత్తమ ప్రతిభ చాటి ఆలిండియా136వ ర్యాంకుని కైవసం చేసుకున్నాడు. ఈనెల 3న నిర్వహించిన ప్రవేశపరీక్షా ఫలితాలను ఇదే నెల 19న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో సాయినితేష్ 136వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ విద్యార్థి తిరుపతిలోని ఎస్వీమెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని టాప్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో జనరల్ మెడిసిన్‌ని అధ్యయనం చేస్తానని అంటున్నాడు. కాగా ఈయన స్నేహలత, శ్రీధర్ (విద్యుత్‌శాఖలో డీఈఈ) దంపతుల కుమారుడు. చెల్లెలు జాహ్నవి పద్మావతి మెడికల్ కళాశాల (స్విమ్స్)లో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు.

వందశాతం.. అడ్మిషన్లు, ఉత్తీర్ణత

ఇదే లక్ష్యంతో పనిచేయాలంటూ సంక్షేమ హాస్టళ్ల అధికారులకు మంత్రి డోలా సూచన



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న మంత్రి, కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

తిరుపతి(జీవకోన), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో వందశాతం ప్రవేశాలు.. ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రీజనల్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. 'వసతి గృహాల మరమ్మతులకు రూ.143కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ.100కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50కోట్లు విడుదల చేశాం. వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వసతి గృహ విద్యార్థులకు నవోదయ, గురుకుల పాఠశాలల్లో.. ఎంసెట్ ప్రవేశ పరీక్షలను రాసేలా అధికారులు సన్నద్ధం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తిరుపతి కలెక్టర్ ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వారిచే తమ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోవడం శుభపరిణామన్నారు. సంక్షేమ శాఖలోని డీడీలు, డీఎస్‌డబ్ల్యూవో, ఎస్‌డబ్ల్యూవో, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనితీరు మార్చుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తూ, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా రాత్రి బస చేయాలని సూచించారు. వసతిగృహాల నిర్వహణ, విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై అవగాహన కల్పించడం కోసమే ఈ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి తెలిపారు. తిరుపతి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ తరపున శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి మానసికంగా, శారీరకంగా బలోపేతం చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మొదటి దశలో 11వేల మంది విద్యార్థులు, 250మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ అవకాశాలు

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని బాబు జగజీవన్‌భవననందు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణను ఆయినన ప్రారంభించారు. జర్మన్‌భాషపై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని సూచించారు. జర్మన్‌భాషపై పట్టు సాధించడానికి ఉచితంగాశిక్షణ ఇచ్చి అర్హత సాధించేలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్, నైపుణ్యాభివృద్ధి శాఖ ఈడీ మధుసూదన్, డైరెక్టర్ లావణ్యవేణి, విక్రమ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో మాక్‌డ్రిల్

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి ప్రభుత్వం తరపున ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. డీఎస్పీలు విశ్వనాథ్, మధుసూదన రావు, ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్, వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శత్రుమూకలను ఎలా ఎదుర్కోవాలి,ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

● విద్యాశాఖ, అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు అనుమతి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాను విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టుల భర్తీకి గాను 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. జూన్ ఐదు నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 19,550మంది హాజరయ్యారు.

సబ్జెక్టులవారీగా ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే..

స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో ఎస్.సాదియా 87.24 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 31.93గా చూపారు. మొత్తం 1190 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో బురదగుంట బావాజీ 83.53 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచాడు. చివరి స్కోర్ 26.27గా చూపారు. మొత్తం 628 మందితో మెరిట్ జాబితాను ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (తమిళం)లో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. 65.07 స్కోర్‌తో జి.నందిని మొదటి స్థానంలో 42.63 స్కోర్‌తో ఎం.సెల్వరాజ్ రెండో స్థానంలో నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో ఎస్.విజయ్ 87.01 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా, చివరి స్కోర్ 23.63గా చూపారు. మొత్తం 1594 మందితో మెరిట్ జాబితా ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)లో వి.సయ్యద్ షాహినూర్ 84.93 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 30.23గా చూపారు. మొత్తం 95 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు

స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్)లో కె.అబ్దుల్ రహమాన్ 84.49 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా.. చివరి స్కోర్‌గా 25.91 చూపారు. మొత్తం 1,890 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్- తమిళ మీడియం)లో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. రవిబాబు ప్రీతి 69.17 స్కోర్‌తో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. చివరిగా 33.83 స్కోర్‌తో ఎన్.ధనలక్ష్మి నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్-ఉర్దూ మీడియం)లో ఎం.ఎస్.సబీనా రహమతున్నీసా 65.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 37.53గా చూపారు. మొత్తం 16 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్)లో జి.సురేఖ 88.80 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.44గా చూపారు. మొత్తం 2238 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్-తమిళ మీడియం)లో జి.తమిళ్‌సెల్వి 66.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 29.30గా చూపారు. 33 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్- ఉర్దూ మీడియం)లో ఎస్.మహ్మమద్ జిలానీ 67 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.47గా చూపారు. మొత్తం 38 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో ఎం.నవీన్ కుమార్ 91 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.5గా చూపారు. మొత్తం 807 మంది మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)లో జి.రాజేష్‌కుమార్ 78.08 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 30.47గా చూపారు. మొత్తం 666 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)లో ఎం.సురేష్‌కుమార్ 86.68 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 19.26గా చూపారు. మొత్తం 4441 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-తమిళ మీడియం)లో పీఎస్ తులసీరామన్ 67.47 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 32గా చూపారు. 33మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.●స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-ఉర్దూ మీడియం)లో షేక్ మౌలాలీ 65.52స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు.చివరి స్కోర్ 29.77గా చూపారు. 76మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

ఎస్జీటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే...

సెంకడరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)లో ఎం.ఉషారాణి 94.62 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.04గా చూపారు. మొత్తం 15,215 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ-తమిళ మీడియంలో పీఎం హేమలత 72.90 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.17గా చూపారు. మొత్తం 90 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ- ఉర్దూ మీడియంలో షేక్ అఫ్రీన్ తాజ్ 83.03 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 27.40గా చూపారు. మొత్తం 406 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

జోన్లవారీగా పీజీటీ మెరిట్ జాబితా

జోన్లవారీగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఇందులో పీజీటీ- ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, తెలుగుతోపాటు ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి బయోసైన్స్, బోటనీ, సివిక్స్ కామర్స్ ఎకనామిక్స్ మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయాలజీ సబ్జెక్టులు ఉన్నాయి. వీటితోపాటు స్టేట్ ప్రిన్సిపాల్ పోస్టుల మెరిట్ జాబితా సైతం విడుదల చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతం



ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి శుక్రవారం నాడు చెంగాళమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీదేవి పూజలు జరిగాయి. ముందుగా ఉభయదాతలు పసుపు, కుంకం, గాజులు, పుష్పాలను అమ్మవారి పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మండపంలో కొలువుదీర్చిన ఉత్సవమూర్తి వద్దకు తీసుకొచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను ప్రారంభించారు. మహిళలు సామూహికంగా వరలక్ష్మీవ్రతాలను ఆచరించారు. చిట్టేటి పెరుమాల్, భాస్కర్ ఆచారి, కర్లపూడి సురేష్, అజంతా బాబు దంపతులు ఉభకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఉభయకర్తలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయ సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి తీసుకొనే రుణాలను పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ జోనల్ మేనేజర్ సీతారామ శర్మ అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్ కసిరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ఏపీఎంలు ప్రసన్న కుమారి, రాజారెడ్డి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం



అమ్మవారి తాళిని చూపుతున్న వేదపండితుడు

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ దక్షిణపొలం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున సీతారాముల కల్యాణం జరిగింది. పట్టాభిరామ ఆలయం కేంద్రంగా సీతారామ ధార్మికసేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో సీతారాముల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. వేదపండితుడు, జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శివరామమ్మ, కోటేశ్వరి, వీరారాఘవరెడ్డి, లక్ష్మమ్మ, నరేష్‌శర్మ, సాయిబాబా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు



క్రీడాకారులతో భరద్వాజా సంస్థ ప్రతినిధులు

తడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విలువిద్యలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజా సేవాసంస్థ నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. తమిళనాడు రాష్ట్రం పొన్నేరిలో జరిగిన ఆర్చరీ చాంపియన్‌షిప్ అండర్-14 పోటీల్లో తడలోని పద్మావతి విద్యాలయం టైనీటాట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పద్మావతి విద్యాలయానికి చెందిన దీప్యచంద్రిక, విజయ్‌మోక్షిత సాయి ప్రథమస్థానం సాధించగా, పినిశెట్టి ఆలియా నాల్గవస్థానంలో నిలిచింది. వీరికి ఆచార్య భరద్వాజా సేవాసంస్థ రూ.5,516 చొప్పున ప్రోత్సాహకాలను అందజేసింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో విభాగాధిపతులు

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాదుకు చెందిన ఐఫిల్ టెక్ సోల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆ సంస్థ సీఈవో కిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటి రౌండ్‌లో రాత పరీక్షలు, రెండవ రౌండ్ ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. 62 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషోంధర్ తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

కోళ్లమిట్టలో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ప్రారంభించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మూడు రోజుల పాటు ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ సెంట్రింగ్ కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ సెంట్రింగ్ కార్మికుడు మునస్వామి (22) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మునస్వామి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతిగా మద్యం తాగుతుండడంతో తల్లి శ్యామలమ్మ మందలించడంతో ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మునస్వామి మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

నేడు ఇరకం దీవిలో పర్యాటకశాఖ ప్రత్యేక కార్యదర్శి పర్యటన

తడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము శనివారం ఇరకందీవిలో పర్యటించనున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి రానున్న ఆయన ఇరకం, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇరకం దీవిలో పర్యాటక రంగానికి అనువైన భూములను పరిశీలిస్తారు. అక్కడ నుంచి షార్‌కు వెళ్తారు.

మెడికల్ షాపు యజమాని ఆత్మహత్య

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌వీధిలో నివాసం ఉంటున్న కృష్ణారెడ్డి(58) ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

108లో ప్రసవం

బాలాయపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) ఓజిలి మండలంలోని లిగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు గురువారం రాత్రి పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో సిబ్బంది కాన్పు చేశారు. వరలక్ష్మి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.



గోతులతో నేలపట్టు - కలుజుమిట్ట గిరిజన కాలనీ దారి - రాళ్లు తేలిన పోలిరెడ్డిపాళెం - కల్లూరు రోడ్డు

ఈ దారులు ఇంతేనా?

- అటవీశాఖ అభ్యంతరాలతో అభివృద్ధికి నోచుకోని రోడ్లు
- రాళ్లు, గోతులతో ప్రజల ఇబ్బందులు
- వర్షాకాలంలో పరిస్థితి దారుణం

దొరవారిసత్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలంలోని పోలిరెడ్డిపాళెం - కల్లూరు, నేలపట్టు కలుజుమిట్ట గిరిజన కాలనీ, నెల్లూరుపల్లి - కొత్తపల్లి గిరిజన కాలనీ రోడ్లు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈ దారులన్నీ అటవీ ప్రాంతంలో ఉండడంతో బీటీ రోడ్ల నిర్మాణానికి చట్టాలు అంగీకరించవంటూ ఆశాఖ అధికారులు అభ్యంతరం చెబుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పోలిరెడ్డిపాళెం - కల్లూరు రోడ్డు 4 కిలోమీటర్ల దూరం ఉంది. జాతీయ రహదారికి లింకు రోడ్డు అయిన ఈ మార్గంలో పోలిరెడ్డిపాళెం గిరిజన కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడ నుంచి అటవీ అధికారుల అభ్యంతరాలతో తారురోడ్డు పనులు ఆపేశారు. దీంతో గ్రావెల్ రోడ్డుగానే ఉండి పోయింది. ఈ మార్గంలో సూరపు అగ్రహారం గ్రామానికి సమీపంలో శివాలయం ఉంది. ఇక్కడకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తారురోడ్డు నిర్మాణానికి ప్రయత్నించినా కార్యరూపం దాల్చలేదు. ఇక నేలపట్టు కలుజుమిట్ట గిరిజన కాలనీ రోడ్డు పరిస్థితీ ఇంతే. 1.5 కిలో మీటర్లు ఉన్న మార్గం నెల్లూరుపల్లి ఆర్‌అండ్‌బీ రహదారికి లింకు రోడ్డు. ఇదంతా అటవీ ప్రాంతం కావడంతో పలు పర్యాయాలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అధికారుల అభ్యంతరాలతో పనులు ప్రారంభంకాలేదు. ఈ మార్గంలో ఆటో వెళ్లడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అలాగే నెల్లూరుపల్లి, రామిరెడ్డికండ్రిగ మీదుగా కొత్తపల్లి గిరిజన కాలనీకి ఉన్న రోడ్డు పరిస్థితి అంతే. నెల్లూరుపల్లి దాటిన తరువాత అటవీ ప్రాంతం ఉండటంతో తారు రోడ్డు నిర్మాణం సాధ్యం కావడంలేదు. దారంతా రాళ్లుతేలి, గోతులు పడడంతో రామిరెడ్డికండ్రిగ నుంచి గిరిజన కాలనీ వరకు అధ్వానంగా ఉంది. ఈ రోడ్లను బాగు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

టిడ్కో గృహాల్లో వసతుల మెరుగుకు చర్యలు: పాశం



టిడ్కోగృహాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల వద్ద వసతుల మెరుగుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాలను పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పేదలకు నివాస గృహాలను అందించాలనే ఉద్దేశంతో టిడ్కో గృహాలను నిర్మించిందన్నారు. ఈ గృహాల్లో సమస్యలు ఉన్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో స్వయంగా పరిశీలించానన్నారు. ఇళ్ల పరిసరాల్లో ముళ్లచెట్టు పెరిగిపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, శివారు ప్రాంతం కావడంతో పాముల బెడద కూడా పెరిగిపోయిందని స్థానికులు తెలిపారన్నారు. దీంతో గృహాల ఆవరణను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఆరికట్ల మస్తాన్ నాయుడు, సురేంద్ర, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దయాకర్‌రెడ్డి



నాయుడుపేట/పెళ్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ నాయుడుపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. దయాకర్‌రెడ్డి రెండోసారి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులవడం పట్ల ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతోటి మురళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా మహాలక్ష్మీ హోమం



బాలాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీ హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్చారణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకచర్ల రమేష్, అయితా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో వసతుల మెరుగుకు కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న తానంకి నానాజీ

చిల్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న కాలనీలో వసతుల మెరుగుకు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. శుక్రవారం కాలనీలోని అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఎన్నికల సమయంలో కాలనీవాసులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. తన సొంత నిధులను వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణాలకు అనుకూలంగా గ్రావెల్ రోడ్లను నిర్మించడంతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీలో పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కొండా రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శేషాద్రి, ఆర్‌ఐ పూర్ణ, వీఆర్‌వో రమణయ్య, బెల్లంకొండ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చెంచు మహాలక్ష్మి

పెళ్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల సమీపంలో నూతనంగా నిర్మించిన నరసింహస్వామి సమేత చెంచు మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రశాంత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల్లో ఊరేగించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జయజయరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, వెండ్లూరు, గూడలి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఎంతో కాలంగా పరిష్కారానికి నోచుకొని పలు భూ సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అక్కడిక్కడే రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు చిరంజీవి, సుబ్రహ్మణ్యం, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్



గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ట్యాక్స్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గూడూరుకు చెందిన కోట సునీల్ కుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

కళాశాలలో సదుపాయాల పరిశీలన

గూడూరు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులను శుక్రవారం విక్రమసింహపురి యూనివర్సిటీ బృందం పరిశీలించింది. కళాశాలలో విద్యార్థులకు వసతులు మెరుగుగా ఉన్నాయని వర్సిటీకి చెందిన డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మణికంఠ సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, శ్రీనివాసులు, షైమూన్, విజయ్‌మహేష్, సురేంద్ర, శైలజ, పీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిలికా తవ్వకాల పరిశీలన

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరంలో అక్రమ సిలికా తవ్వకాలను వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. సిద్ధవరం సమీపంలో ప్రభుత్వ భూముల్లో నుంచి అక్రమంగా సిలికాను తవ్వి తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సిలికా తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

మహాచండీ హోమం



హోమం చేస్తున్న అర్చకులు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలోని విష్ణుదుర్గాదేవి ఆలయంలో 9వ వార్షికోత్సవం, శ్రావణ శుక్రవారం సందర్భంగా విష్ణుదుర్గాదేవికి మహాచండీ హోమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కలశ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ సురేష్ మహారాజ్, వీపీ ప్రకృతికుమార్, స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద చిరంజీవి సేవాసంఘం అధ్యక్షుడు మాభాషా ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోటి, సూరి, ప్రభు, తేజ, దాసు, పద్మజ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

వైభవంగా కుంకుమపూజ



పోలేరమ్మ ఆలయం వద్ద కుంకుమపూజ చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యంగా అంబళ్లను అందజేశారు. సాయంత్రం పోలేరమ్మను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, సభ్యులు కురుగొండ ధనంజయ, కావ్య కృష్ణారెడ్డి, ఆబోతుల బాబు, హైమా, మురళి, టీడీపీ నాయకులు బిరదవాడ నారాయణ, మల్లాం రవి, బిరదవాడ శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగు తుందని డీఎస్పీ గీతా కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్, కృష్ణయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాస చివరి శుక్రవార పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని 108కేజీల పసుపుతో అభిషేకించారు. కన్యకాపరమేశ్వరి, గంగమ్మదేవి, నారాయణమ్మ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చిల్లకూరు: తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి, కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆల యంలో ఆదిలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాస పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట:గ్రామదేవత కోటమ్మకు ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవార పూజలు నిర్వ హించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపు లేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దాతృత్వంతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు. అన్నదానం చేశారు.

'వింగ్ టెక్' కార్మికులను ఆదుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సమీపంలోని వింగ్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. యువతకు ఉపాధి కల్పిస్తామనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూములను కారుచౌకగా తీసుకున్న పరిశ్రమ యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. పదివేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి కేవలం 250 మందితో పనులు చేయించుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

3 నుంచి పవిత్రోత్సవాలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో సెప్టెంబరు 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 2వ తేదీ ఉదయం రుత్వికులకు విధులు కేటాయించి వస్త్రసమర్పణ చేస్తారు. సాయంత్రం ఆలయ విమాన ప్రాకారం చుట్టూ సేనాధిపతి ఊరేగింపు అనంతరం యాగశాలలో అంకురార్పణ నిర్వహించనున్నారు. 3వ తేదీ ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు ఉంటాయి. 4న మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మాడవీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామి వారికి పవిత్రాలను సమర్పిస్తారు. 5న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈమూడు రోజులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

తిరువీధుల్లో కపిలేశ్వరుడి చిద్విలాసం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని కామాక్షి సమేతుడై కపిలేశ్వరస్వామి తిరువీధుల్లో విహరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కామాక్షి సమేతుడైన కపిలేశ్వరస్వామి ఉత్సవర్లు చప్పరం అధిరోహించి కర్పూర హారతులందుకున్నారు. అనంతరం తిరువీధుల ఉత్సవానికి బయలుదేరారు. ముందు కోలాట నృత్యాలు సాగుతుండగా చంద్రశేఖరుడి పురవిహారం అత్యంత వైభవంగా సాగింది. ఆదిదేవుడి దివ్యదర్శనంతో భక్తజనం పులకించింది.

వింగ్‌టెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి: సీఐటీయూ


సమావేశంలో మాట్లాడుతున్న కందారపు మురళి

రేణిగుంట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వింగ్ టెక్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ.1,068 కోట్లు పెట్టుబడి పెట్టి పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పడంతో వింగ్ టెక్ పరిశ్రమకు అప్పటి సీఎం చంద్రబాబు అనేక రాయితీలతో పాటు 75 ఎకరాలను ఇచ్చారన్నారు. అయితే 2019 తర్వాత 1400 మందికి ఉపాధి కల్పించి 1200 మందిని తొలగించిందన్నారు. ప్రస్తుతం కేవలం 205 మందితో నడుస్తోందన్నారు. రూ.250 కోట్ల జీఎస్టీ బకాయిలు ఉన్నాయని, దీంతో చైనా సంస్థకు పరిశ్రమను విక్రయానికి పెట్టారన్నారు. ఈ బదలాయింపుల్లో భాగంగా పరిశ్రమలో ఉన్న రూ.6 కోట్ల విలువైన మొబైళ్లను తరలించడానికి ప్రయత్నిస్తుండగా, ఉద్యోగులతో కలిసి కార్మికులు అడ్డుకున్నారన్నారు. ఇటీవల రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో ఉన్న పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, పుల్లయ్య, గురవయ్య, మునిరాజా, ఈశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ


కలెక్టర్‌తో అధికారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండల పరిసరాల్లో కేంద్ర మంత్రిత్వ శాఖ ఫర్నిచర్ ఫిట్టింగ్ స్కిల్ కౌన్సిల్, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు శుక్రవారం ప్రతినిధులు తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీన్‌ప్యానెల్ కంపెనీ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన 30మందికి ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగ వారికి ఉచితవసతి, మూడు నెలల పాటు హైదరాబాద్‌కు చెందిన నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సమగ్ర శిక్షణ ఇస్తుందన్నారు. దక్షిణ ప్రాంత స్కిల్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, విజయలక్ష్మి, కళాసృష్టి కార్యదర్శి దశరథాచారి తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంగా ఆగ్నేయ వినాయకస్వామి మూలస్థానం


మురుగును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో నవ సంధి వినాయకుల్లో ఒకటైన ఆగ్నేయ గణపతి ఆలయం మురికి కూపంగా మారిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్ర వారం వైసీపీ నాయకులతో కలిసి అయన ఆ ప్రాంతాన్ని పరిశీ లించారు అయన మాట్లాడుతూ ఆగ్నేయ గణపతి ఆలయాన్ని ఆలయ అధికారులు, పురపాలక సంఘ అధికారులు పునఃనిర్మాణం కోసం తొ లగించారన్నారు. అయితే ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదన్నారు. మురుగు నీటిని మళ్లించి వెంటనే పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టాలన్నారు. ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీనివాసులు, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యాం, శరవణకుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు బహుమతులు



సత్యవేడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు బహుమతులను ప్రదానం చేశారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి పాండురంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు బి.బాలసుందరం రెడ్డి, డి.రవి, బండారు మోహన్‌బాబు, ఆనంద్ పాల్గొని బహుమతులను అందజేశారు. కె.పావని (560 మార్కులు)కి రూ.10వేలు, ఎం.దర్శిని(543 మార్కులు)కి రూ. ఆరువేలు, ఎం.అంకిత గ్రేస్ (536 మార్కులు)కి రూ.నాలుగు వేలును అందించారు. జక్కుల చొక్కలింగం, ఎస్.రమేష్‌రాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చవితికి సిద్ధమైన వినాయక ప్రతిమలు



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చవితికి వినాయక ప్రతిమలును సిద్ధం చేశారు. ఈ నెల 27న వినాయక చవితి కావడంతో ముందస్తుగా వివిధ ఆకృతుల్లో ప్రతిమలను విక్రయానికి సిద్ధం చేశారు. ఐదు అడుగుల నుంచి 15 అడుగుల వరకు ప్రతిమలను తీర్చి దిద్దారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

పుత్తూరు టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలి వద్ద చిరంజీవి అభిమానులు, బాస్ నాయకులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం శివాలయంలో ఆయన పేరుమీద పూజలు నిర్వహించారు. అనంతరం మదర్ థెరిసా బధిర పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేశారు. గోపి, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

గిరి బలిజల జీవో రద్దు చేయాలి

పుత్తూరు టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గిరి బలిజల జీవోను రద్దు చేయాలని బలిజ సేవా సంఘం నాయకులు తహసీల్దారుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొమ్మర కులస్థులను బలిజ కులస్థులుగా చేరుస్తూ ప్రభుత్వం జీవో 179 జారీ చేసిందన్నారు. జీవో కారణంగా బలిజ కులస్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. బాస్ నాయకులు గోపి, కృష్ణయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

దాసరి మునెయ్యకు తెలుగు తేజం పురస్కారం

పుత్తూరు టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు పట్టణానికి చెందిన యూటీఎఫ్ నాయకుడు దాసరి మునెయ్యను ప్రభుత్వం తెలుగు సాహితీ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 31న పల్నాడు జిల్లా నరసారావుపేటలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే తెలుగు భాషా కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వడమాలపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాదిరేడు, వడమాలపేట సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవికుమార్ చెప్పారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ పరఫరా ఉండదన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

వడమాలపేట,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీతారామపురంలో ఈనెల 24వ తేది ఆదివారం మెగా వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి రవిరాజు చెప్పారు. తిరుపతి వాసన్ ఐకేర్, మాధురి రెమిడీ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో శిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

వడమాలపేట,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలలోని ఓబిఆర్ కండ్రిగ సమీపంలో మామిడి తోటలో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఆరుగురిని అదుపులోనికి తీసుకొన్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. శుక్రవారం పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసామన్నారు. ఇక సంఘటన స్థలంలో రూ. 4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైకాలవారి పెండ్లిమండపంలో జరిగే చవితి మహోత్సవానికి విచ్చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌ని శుక్రవారం కైకాల మండప నిర్వాహకులు, చెంబేడు సహా 14 గ్రామాల ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ యేడు పంచముఖ వినాయక ప్రతిమను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చియ్యవరంలో భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం


ప్రజల సమస్యలు వింటున్న జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చియ్యవరంలో భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. చియ్యవరం గ్రామంలో జేసీ శుభం బన్సల్‌తో కలిసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఇందులోభాగంగా అత్యధిక రెవెన్యూ సమస్యలు ఉన్న చియ్యవరం గ్రామాన్ని ఎన్నుకుని మొదట జిల్లా యంత్రాంగాన్ని ఇక్కడికు తీసుకువచ్చానన్నారు. వచ్చే నెల మొదటి వారంలో మళ్లీ సర్వే జరిపించి 45 రోజుల్లో చియ్యవరం భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ... రైతుల భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్ పట్టుబట్టి ఈ గ్రామంలో రెవెన్యూ సమస్యలు తీర్చాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి



శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము దర్శించు కున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

విలేకరుల అభ్యున్నతికి కృషి

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విలేకరుల అభ్యున్నతికి సహకరిస్తానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని విలేకరులు స్నేహ భావంతో మెలగాలన్నారు. ఇక పట్టణంలో ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించి అందులో భవనం నిర్మిస్తామని తెలిపారు. విలేకరులకు జీతాలు వచ్చే విధంగా అసెంబ్లీలో చర్చిస్తానని చెప్పారు. విలేకరుల కుటుంబాలకు బీమా చేయిస్తామన్నారు.

విద్యార్థులకు చేయూత

రేణిగుంట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, ఆఫీసు సిబ్బంది దివాకర్ ఆర్థిక సాయంతో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు రెండు సైకిళ్లు, 100 వాటర్ బాటిళ్లు తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఇంద్రాదేవి, ఎంఈవో రంగనాథయ్య అందజేశారు. హెచ్ఎం విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సత్యవేడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమర్తికండ్రిగ గిరిజన కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేవీపీఎస్ నాయకుడు అరుణాచలం, సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవికను కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పర్యటించిన ఏఈకి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న నీరు తాగడానికి పనికి రాదని తెలిపారు. దీంతో దూరప్రాంతాల నుంచి బిందెలతో మోసుకు రావాల్సి వస్తోందన్నారు. స్పందించిన ఏఈ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి గుర్తుతెలియని వ్యక్తులకు గాయాలు



కేవీబీపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువపై ఉన్న డివైడర్‌ను ఢీకొని శుక్రవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి అంబులెన్సులో వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి వివరాలు తెలియరాలేదు. మద్యం మత్తులో వారు మాట్లాడలేక పోతున్నారని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

శ్రీకాళహస్తి, 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వలస కార్మికుడు జన్‌దేవ్(53) తీవ్రంగా గాయపడ్డాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన జన్‌దేవ్ శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద ఉన్న ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని పరిశ్రమ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడిన జన్‌దేవ్‌ను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జగన్నాథానికి తెలుగుతేజం అవార్డు

వరదయ్యపాళెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారుడు పోలూరు జగన్నాథం ప్రముఖ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక అందించే 'తెలుగు తేజం' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 31న పల్నాడు జిల్లా నరసారావు పేటలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

రైతులకు చేయూతనిస్తాం: ఎమ్మెల్యే ఆదిమూలం


మెగాచెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం ఎంపీ డీవో కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలానికి చెందిని 4,284 మంది రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత మెగా చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలను దశల వారీగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం ముస్లింపాళెం, లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భారతమ్మ, నాయకులు జయచంద్ర నాయుడు, శ్రీనివాసులు నాయుడు, మునిభూషణమ్మ, రోశయ్య, జయశంకర్‌రెడ్డి, దిలీప్ రాయల్, తడ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ సుధీర్, అగ్రికల్చర్ ఏడీఏ సుబ్రమణ్యం, ఏవో గౌరి తదితరులు పాల్గొన్నారు. ఇందిరానగర్‌లో చేనేత కార్మికులు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని సన్మానించారు.

పింఛన్ల తొలగింపు వదంతులే


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పింఛన్ల తొలగింపు వదంతులను నమ్మవద్దని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం అర్హులకు పింఛన్లు తొలగిస్తోందని గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. గత వైసీపీ హయాంలో నకిలీ సర్టిఫికెట్లతో 80వేలమంది పింఛను పొందుతున్న వారిపై మాత్రమే విచారణ చేస్తున్నారన్నారు. తగిన సర్టిఫికెట్ చూపిస్తే పింఛను తిరిగి ఇస్తారన్నారు. వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం సింగిల్‌విండో చైర్మన్ బి.భాస్కర్ ముదిరాజ్, నాయకులు మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, మణి, మురళీ నాయుడు, భగత్, రమేష్, సులేమాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీ శ్వరాలయంలో అమావాస్య ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు.

కారు దగ్ధం



శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంతో కారు దగ్ధమైంది. పట్టణంలోని వీఎంసీకూడలిలో ఉన్న ఓ మెకానిక్ దుకాణంలో ఆమ్ని కారుకు వెల్డింగ్ చేస్తుండగా నిప్పంటుకుని దగ్ధమైంది. ఇంజన్ పేలుడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మెగాస్టార్ జన్మదిన వేడుకలు

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేవారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి మాట్లాడుతూ... ట్రస్టు ద్వారా రక్తదాన శిబిరాలు, నేత్రాలయాలు వంటి అనేక సేవా కార్యక్రమాలతో మెగాస్టార్ చిరంజీవి తన సమాజానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. మాధవ మహేష్, ఆస్పత్రి కమిటీ సభ్యులు కుమార్, గరికపాటి రమేష్‌బాబు, జనసేన నాయకులు విజయకుమార్, ఈర్ల చిరంజీవి, మోహన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయపేడు, కళత్తూరు, పెరిందేశం, రాగిగుంట, ఓళ్యూరు, మిద్దికండ్రిగల్లో చిరంజీవి అభిమానులు వేడుకలను నిర్వహించారు. రాయపేడుకు చెందిన మాధవ, కన్నయ్య ఆధ్వర్యంలో కేవీబీపురం పీహెచ్‌సీలో పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వెంకటస్వామి, ప్రతాప్, భూపతి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు శుక్రవారం స్థానిక గిరిజన కాలనీవాసులకు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్లు



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలు కోసం నిర్మించిన మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. గత ఏడాది మండల పరిషత్ నిధులతో మరుగుదొడ్లు నిర్మించారు. స్లాబ్ వరకు పనులు చేపట్టి వదిలి వేశారు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

రోగాల పట్ల అప్రమత్తం

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ నరసింహ వర్మ సూచించారు. కళాశాలలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను తీసుకోవాలన్నారు.అధ్యాపకులు బాపనయ్య, తులసి, సునిత, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రదండోరాకు కదలిరండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జరిగే సీపీఐ రాష్ట్ర సభల్లో భాగంగా ఎర్ర దండోరాను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు మించల శివకుమార్ కోరారు. ఈ సభలకు వ్యవసాయ కార్మికులు, కర్షకులు, ఉపాధికూలీలు, మహిళలు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తు తరలిరావాలన్నారు.

తొలగించిన వికలాంగ పింఛన్లను పునరుద్ధరించండి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మోహనప్రియ తదితరులు

ఏర్పేడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండీపుత్తూరు లో తొలగించిన వికలాంగ పింఛన్లను పునరుద్ధరిచాలని సర్పంచ్ మోహనప్రియ ఎంపీడీవో సౌభగ్యంకు పింఛనుదారులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నలుగురు వికలాంగుల పింఛన్లు తొలగించారని, పరిశీలించి పునరుద్ధరించాలని కోరారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు



ఏర్పేడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారికి అంబళ్లు పోసి పూజలు చేశారు.

సరస్వతిదేవికి...



శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏస్వీయే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతిదేవి విగ్రహప్రతిష్ఠాపన జరిగి ఏడాది పూర్తి కావడంతో ఈ పూజలు చేశారు. ప్రిన్సిపాల్ భారతి, విశ్రాంత ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.